ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



తమిళనాడు

TAMILNADU

మంగళవారం 12 మార్చి 2024

పని లేకే రాష్ట్రంలో పర్యటన

- ఆక్సిజన్‌లాంటి పన్నుల రాబడిని తగ్గిస్తారా?
- గ్యాస్ ధర రూ.500కు పెంచి రూ.100 తగ్గింపా?
- రాష్ట్రాలపై పక్షపాత వైఖరిని ప్రదర్శిస్తారా?
- ధర్మపురి సభలో ప్రధాని మోదీపై స్టాలిన్ ధ్వజం



ధర్మపురి సభలో లబ్ధిదారులకు సహాయాల పంపిణీలో స్టాలిన్


చెన్నై, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాలకు ప్రాణవాయువు లాంటి పన్నుల రాబడిని తగ్గించేందుకు కేంద్రంలోని ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలోని కేంద్రప్రభుత్వం కుట్ర పన్నుతోందని, విపక్షాలు పరిపాలించే రాష్ట్రాలపై సవతి తల్లి ప్రేమను ప్రదర్శిస్తోందని డీఎంకే అధ్యక్షుడు, సీఎం స్టాలిన్ ధ్వజమెత్తారు. ధర్మపురి ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల మైదానంలో సోమవారం ఉదయం ఏర్పాటైన భారీ బహిరంగ సభలో ధర్మపురి, కృష్ణగిరి, సేలం జిల్లాల్లో రూ.560 కోట్లతో చేపట్టనున్న 75 కొత్త పథకాలకు ఆయన శంకుస్థాపన చేశారు. ఆ మూడు జిల్లాలకు చెందిన లబ్ధిదారులకు సహాయాలు పంపిణీ చేశారు. ధర్మపురి జిల్లాలో రూ. 151.89 కోట్లతో పూర్తయిన పథకాలకు, కృష్ణగిరి జిల్లాలో రూ.34.10 కోట్లతో పూర్తయిన పథకాలకు, సేలం జిల్లాలో 164.51 కోట్లతో పూర్తయిన పథకాలను ప్రారంభించారు. ఆ సభలో స్టాలిన్ ప్రసంగిస్తూ... వంట గ్యాస్ ధరను రూ.500కు పెంచి, లోక్‌సభ ఎన్నికల్లో ఓట్ల కోసం ఉన్నట్టుండి దాని ధరను రూ.100 తగ్గించడాన్ని మోదీ గొప్పలు చెప్పుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. రాష్ట్రాలు ఆర్థిక పరిపుష్టిని కలిగి ఉంటేనే కేంద్రానికి ఆదాయం వస్తుందనే కనీస పరిజ్ఞానం కూడా లేని మోదీ రాష్ట్రాల ఆర్థిక హక్కులను హరిస్తున్నారని మండిపడ్డారు. ఎన్నికల సమయంలోనే ప్రధాని మోదీకి తమిళ భాషపై, తమిళ ప్రజలపై ప్రేమ పుట్టుకువస్తుందని, పదేపదే ఆయన చేస్తున్న రాష్ట్ర పర్యటనను ప్రజలు పట్టించుకోవడమే లేదని స్టాలిన్ అన్నారు. ఎన్నికలు సమీపించడం వల్లే ఉన్నట్టుండి మదురై ఎయిమ్స్ ఆసుపత్రి పనులు ప్రారంభమైనట్లు నాటకాలాడుతున్నారన్నారు.

ధర్మపురి అంటేనే తనకు హొగెనేకల్ చట్టుక్కున గుర్తుకు వస్తుందని, 2008లో తాను స్థానిక సంస్థల శాఖ మంత్రిగా ఉన్నప్పుడు రూ.1928 కోట్లతో హొగెనేకల్ సమగ్ర తాగునీటి సరఫరా పథకం ప్రారంభించి కోటానుకోట్లమంది దాహార్తిని తీర్చానని గుర్తు చేశారు. అదే విధంగా రాష్ట్రంలోనే తొలిసారి మహిళా స్వయం సహాయక సంఘాలను కూడా ఈ ధర్మపురిలోనే అప్పటి ముఖ్యమంత్రి కరుణానిధి ప్రారంభించారని చెప్పారు. ఇక గృహిణులకు అందజేసే కలైంజర్ మహిళా సాధికారిక నగదు పంపిణీకి తొలి శిబిరాన్ని కూడా తాను ధర్మపురిలోనే ప్రారంభించానని చెప్పారు. ఈ పథకం ద్వారా 1.15 కోట్ల మంది గృహిణులు లబ్ధి పొందుతున్నారని చెప్పారు. వెలుగు బాట పయనం ద్వారా మహిళలు ప్రతినెలా రూ.888ను పొదుపు చేయగలుగుతున్నారని, అల్పాహార పథకం కింద రోజూ 16 లక్షల మంది చిన్నారులు పస్తులు లేకుండా బడుల్లో గడుపుతున్నారని చెప్పారు. పుదుమై పెణ్ పథకం ద్వారా ప్రతి నెలా ఉన్నత చదువులు చదివే విద్యార్థినులకు రూ.1000 వారి బ్యాంక్ ఖాతాల్లో జమ అవుతోందని చెప్పారు. నాన్ ముదల్వన్ పథకం కింద రెండేళ్లలో 28లక్షల మంది యువకులు ప్రతిభా పాటవాలను పెంపొందించుకుని మంచి ఉద్యోగాల్లో చేరుతున్నారని, ఇళ్ల వద్దకే విద్య పథకం ద్వారా 24 లక్షల మందికి పైగా బడిపిల్లలు లబ్ధి పొందారని చెప్పారు. రెండు లక్షల మంది రైతులకు కొత్తగా ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నామని తెలిపారు. మూడేళ్లుగా తమ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల ఫలితాలు అందరికీ చేరుతున్నాయా? అని పరిశీలించేందుకు ఇటీవలే తాను 'నీంగళ్ నలమా?'ను ప్రారంభించానని తెలిపారు. ద్రావిడ తరహా పాలనలో అందరికీ అన్ని సదుపాయాలు కల్పిస్తామని తెలిపారు. గత పదేళ్లుగా అధికారంలో ఉన్న అన్నాడీఎంకే ప్రభుత్వం అక్రమార్జనలపైనే ప్రాధాన్యం ఇచ్చి ఖజానాను ఖాళీ చేసిందని ఆరోపించారు.

ఈ సభలో మంత్రులు కేఎన్ నెహ్రూ, ఈవీ వేలు, ఎంఆర్‌కే పన్నీర్‌సెల్వం, చక్రపాణి, ఎం. సుబ్రమణ్యం, ఎంపీలు డాక్టర్ సెంథిల్‌కుమార్, పార్తీబన్, చెల్లకుమార్, శాసనసభ్యులు జీకే మణి, వెంకటేశ్వరన్, ప్రకాష్, మది అళగన్, రామచంద్రన్, రాజేంద్రన్, మాజీ మంత్రి పళనియప్పన్, జిల్లా కలెక్టర్ శాంతి తదితరులు పాల్గొన్నారు.

కన్నయన్ దక్షిణామూర్తికి సాహిత్య అకాడమీ అవార్డు





కన్నయన్ దక్షిణామూర్తి, 'కరుంగుండ్రమ్'

చెన్నై, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): కేంద్ర సాహిత్య అకాడమీ ఈ యేడాదికి తమిళంలో అత్యుత్తమ అనువాదకుడిగా కన్నయన్ దక్షిణామూర్తిని ఎంపిక చేసింది. అరుణాచల ప్రదేశ్‌కు చెందిన రచయిత మమాంగ్ దయ్ రచించిన 'ది బ్లాక్ హిల్' అనే నవలను తమిళంలో 'కరుంగుండ్రమ్' పేరుతో అనువదించినందుకు ఆయన సాహిత్య అకాడమీ అవార్డును అందుకోనున్నారు. కన్నయన్ దక్షిణామూర్తి గత కొన్నేళ్లు ప్రపంచ వ్యాప్తంగా వివిధ భాషల్లో అత్యుత్తమ సాహిత్యాన్ని తమిళంలో అనువదించి పేరు గడించారు. ఈ మేరకు 'ఎనదు అరశియల్ వాళ్క్కై, మహాత్మాగాంధీయిన్ చిందనైగళ్, పురట్చి185, ఇందిరా గాంధీ, ఇలంగయిన్ చిరుకథైగళ్, వివేకానందర్ ఇలయోరిన్ ఎళుచ్చి నాయగన్' వంటి రచనలు సాహిత్యాభిమానులను బాగా ఆకట్టుకున్నాయి.

మైసూరుకు రెండో వందే భారత్ రైలు

- నేడు ప్రారంభించనున్న ప్రధాని



పెరంబూర్, మార్చి 11: మైసూరు - బెంగళూరు - చెన్నై సెంట్రల్ మధ్య రెండో వందే భారత్ రైలు సేవలను మంగళవారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించనున్నారు. కొద్ది నెలల క్రితం ప్రారంభించిన చెన్నై సెంట్రల్ - బెంగుళూరు - మైసూరు వందే భారత్ రైలుకు ప్రయాణికుల నుంచి మంచి స్పందన లభిస్తోంది. ఈ రైలు ఉదయం చెన్నై సెంట్రల్ నుంచి బయల్దేరి మధ్యాహ్నం మైసూరు చేరుకుంటుంది. మంగళవారం ప్రారంభించనున్న రెండో వందే భారత్ రైలు ఉదయం మైసూరులో బయల్దేరి మధ్యాహ్నం చెన్నై సెంట్రల్ చేరుకుంటుంది. ప్రస్తుతం నడుపుతున్న వందే భారత్ రైలు ఛార్జీలే రెండో వందే భారత్ రైలుకు వర్తిస్తాయని అధికారులు తెలిపారు.

ఉదయం 6 గంటలకు మైసూరు నుంచి...

మైసూరు నుంచి ఉదయం 6 గంటలకు బయల్దేరే వందే భారత్ రైలు 7.45 గంటలకు బెంగుళూరు చేరుకొని, అక్కడి నుంచి బయల్దేరి మధ్యాహ్నం 12.20 గంటలకు చెన్నై సెంట్రల్ చేరుకుంటుంది. మరోమార్గంలో చెన్నై సెంట్రల్ నుంచి సాయంత్రం 5 గంటలకు బయల్దేరి రాత్రి 9.25 గంటలకు బెంగళూరు చేరుకొని, అక్కడి నుంచి బయల్దేరి 11.20 గంటలకు మైసూరు చేరుకుంటుంది. ఈ రైలు మాండ్యా, ఎస్‌ఎంవీటీ బెంగళూరు, కృష్ణరాజపురం, జోలార్‌పేట, కాట్పాడి రైల్వేస్టేషన్లలో ఆగనుంది. వారంలో బుధవారం మినహా మిగిలిన ఆరు రోజులు ఈ రైలు సేవలు అందుబాటులో ఉంటాయి. రెండో వందే భారత్ రైలు ప్రారంభంతో చెన్నై నుంచి బెంగళూరుకు ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రయాణించే సౌకర్యం కలగ్గా, చెన్నై నుంచి బెంగళూరుకు 4.25 గంటల్లో చేరుకోవచ్చని అధికారులు తెలిపారు.

పుదుచ్చేరి వరకు సర్కార్, కాచిగూడ ఎక్స్‌ప్రెస్...

ఇదిలా వుండగా కాచిగూడ నుంచి చెంగల్పట్టుకు నడుపుతున్న ఎక్స్‌ప్రెస్, కాకినాడ పోర్ట్ నుంచి చెంగల్పట్టుకు నడుపుతున్న సర్కార్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు వారంలో మూడు రోజులు పుదుచ్చేరి వరకు నడవనున్నాయి.

మళ్లీ ప్రధాని మోదీ సుడిగాలి పర్యటన

- సేలం సహా 3 నగరాల్లో ప్రచార సభలు
- 15నుంచి మొదలు



చెన్నై, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రం నుంచి ఈసారైనా గణనీయమైన స్థానాలు సంపాదించాలని పట్టుదలతో వున్న ప్రధానమంత్రి నరేంద్రమోదీ.. మరోసారి రాష్ట్రంలో సుడిగాలి పర్యటనకు వస్తున్నారు. ఈ నెల 15, 16, 18 తేదీల్లో సేలం, కన్నియాకుమారి, కోయంబత్తూరు నగరాల్లో ఆయన వివిధ కార్యక్రమాల్లో, బహిరంగ సభల్లో పాల్గొననున్నారు. ఫిబ్రవరిలో మోదీ రెండుసార్లు రాష్ట్రంలో పర్యటించి అధికారిక కార్యక్రమా ల్లో పాల్గొని అభివృద్ధి పథకాలను ప్రారంభించడంతోపాటు బీజేపీ ఆధ్వర్యంలో జరిగిన బహిరంగ సభల్లోనూ పాలొని రాష్ట్రంలో డీఎంకే ప్రభుత్వంపై విమర్శనాస్త్రాలు సంధించి బీజేపీ శ్రేణుల్లో నూతనోత్తేజం సృష్టించారు. ఈ నేపథ్యంలో మూడో విడతగా ఆయన రాష్ట్ర పర్యటనకు శ్రీకారం చుడుతున్నారు. ఈనెల 15న సేలం నగరంలోని గెజ్జలనాయకన్ పట్టి వద్ద ఏర్పాట య్యే బహిరంగసభలో పాల్గొని ప్రసంగించనున్నారు. ఆ సభలో సేలం, నామక్కల్, కరూరు లోక్‌సభ నియోజకవర్గాల ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తారు. ఈ సభలో పాల్గొనే నిమిత్తం ఆయన ప్రత్యేక విమానంలో సేలంకు విచ్చేయనున్నారు. ఉదయం 11 గంటలకు ఈ బహిరం గ సభ జరుగుతుంది. ఈ సభ ముగియగానే ఆయన కోయంబత్తూరుకు బయలుదేరి వెళతారు. అదేవిధంగా ఈ నెల 16న కన్నియాకుమారి బహిరంగ సభలో ఆయన ప్రసంగించనున్నారు. ఆ సభలో రాష్ట్రంలో పోటీ చేయనున్న ఎన్డీయే అభ్యర్థులను పరిచయం చేయనున్నారు. కన్నియాకుమారి, తిరునల్వేలి, తూత్తుకుడి, రామనాథపురం, తెన్‌కాశి లోక్‌సభ నియోజకవర్గాలకు చెందిన ప్రజలనుద్దేశించి మోదీ ప్రసంగిస్తారు. కన్నియాకుమారి వివేకానంద కళాశాల మైదానంలో ఈ సభ జరుగుతుంది. అదే విధంగా ఈ నెల 18న ప్రధాని మోదీ వాణిజ్య నగరం కోయంబత్తూరులో ఏర్పాటయ్యే బీజేపీ బహిరంగ సభలో పాల్గొని ఎన్డీయే అభ్యర్థులను పరిచయం చేసి ప్రసంగించనున్నారు. కోయంబత్తూరు, పొల్లాచ్చి, నీలగిరి, తిరుప్పూరు లోక్‌సభ నియోజకవర్గాలకు చెందిన ప్రజలనుద్దేశించి ఆయన ప్రసంగిస్తారు. కోవై కొటీషియా మైదానంలో ఈ సభ జరుగుతుందని బీజేపీ స్థానిక నాయకులు తెలిపారు. ప్రస్తుతం మోదీ పర్యటించనున్న మూడు నగరాలలోను పోలీసు ఉన్నతాధికారులు పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు చేపడుతున్నారు.

రంజాన్ వేళలు

మంగళవారం : ఇఫ్తార్ : సాయంత్రం - 6.26

బుధవారం : సహర్ : ఉదయం - 4.37



ఈసీ అధికార సమీక్ష

అడయార్, మార్చి 11: లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ వెలువడనున్న నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం ప్రధానాధికారి రాజీవ్ కుమార్.. రాష్ట్రానికి చెందిన ఐఏఎస్, ఐపీఎస్, ఐఆర్‌ఎస్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. సచివాలయంలో సోమవారం ఉదయం 10 గంటలకు నామక్కల్ కవింజర్ మాలిగై లోని పదో అంతస్తులో ఈ సమావేశం జరిగింది. ఇందులో రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి సత్యప్రద సాహుతో పాటు అనేకమంది బ్యూరోక్రాట్లు, పోలీస్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఇందులో వివిధ అంశాలపై ఆయన చర్చించారు. ముఖ్యంగా ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన తర్వాత, ఎన్నికల సమయంలో ఎలాంటి నియమ నిబంధనలు పాటించాలి తదితర అంశాలపై చర్చించారు. ఎన్నికల సమయంలో నగదు బట్వాడా, పోటీ చేసే అభ్యర్థుల ఖర్చుల వివరాలపై ఏ విధంగా నిఘా సారించాలి, శాంతి భద్రతల పరిరక్షణ, ఓటర్లు స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకునేందుకు తీసుకోవాల్సిన చర్యలు, బందోబస్తు తదితర అంశాలపై కూలంకషంగా చర్చించారు. ఈ సందర్భంగా సీఈసీ రాజీవ్ కుమార్ మాట్లాడుతూ...



అధికారులకు సూచనలిస్తున్న రాష్ట్ర ఎన్నికల అధికారి

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద భద్రతను రెట్టింపు స్థాయిలో కల్పించాలని సూచించారు. అలాగే, ఎన్నికల సిబ్బందిని కూడా అధిక సంఖ్యలో వినియోగించేలా చర్యలు తీసుకోవాలని సలహా ఇచ్చారు. కాగా, గతంలో కూడా రాజీవ్‌కుమార్, ఎన్నికల కమిషనర్ అరుణ్ గోయల్‌తో కలిసి చెన్నైకి వచ్చి అఖిలపక్ష నేతలతో పాటు అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో ఎన్నికల భద్రత, నిర్వహణ, ఎన్నికల తేదీల ఖరారు తదితర అంశాలపై చర్చించిన విషయం తెల్సిందే. ఆ తర్వాత ఎన్నికల సంఘానికి చెందిన మరో ముగ్గురు కమిషనర్లు కూడా వచ్చి రాష్ట్ర ఉన్నతాధికారులతో సమావేశమై వివిధ అంశాలపై చర్చించారు. ఇపుడు మరోమారు సీఈసీ రాజీవ్ కుమార్ ఢిల్లీ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎన్నికల ఏర్పాట్లపై సమీక్షించారు. కాగా, సార్వత్రిక ఎన్నికల సమరంలో భాగంగా, తమిళనాడులోని 39, పుదుచ్చేరిలోని ఒక లోక్‌సభ స్థానానికి ఎన్నికలు నిర్వహించనున్నారు. ఈ ఎన్నికల్లో డీఎంకే, అన్నాడీఎంకే, బీజేపీ సారథ్యంలోని భాగస్వామ్య పార్టీలు తమ బలాన్ని నిరూపించుకోనున్నాయి.

రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌గా జ్యోతి నిర్మలాస్వామి



పెరంబూర్, మార్చి 11: రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌గా జ్యోతి నిర్మలాస్వామిని నియమిస్తూ రాష్ట్రప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ఎన్నికల కమిషనర్‌గా వ్యవహరిస్తున్న ప్రవీణ్‌కుమార్ పదవీ విరమణ పొందిన నేపథ్యంలో, రిజిస్ట్రేషన్ శాఖ కార్యదర్శిగా పని చేస్తున్న జ్యోతి నిర్మలాస్వామి రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌గా నియమితులయ్యారు.

బీజేపీతో టచ్‌లో డీఎండీకే, పీఎంకే?

- అన్నాడీఎంకేతో కుదరని సర్దుబాట్లు!

చెన్నై, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో ఎన్నికల్లో ఎలాగైనా సత్తా చాటాలన్న లక్ష్యంతో తీవ్రంగా శ్రమిస్తున్న బీజేపీ.. తమ కూటమిలోకి బలమైన పార్టీలను ఆకర్షించేందుకు గట్టిగా ప్రయత్నాలు చేస్తోంది. ఇందులో భాగంగా అన్నాడీఎంకే కూటమిలో చేరేందుకు సిద్ధమైన డీఎండీకే, పీఎంకేలను తమవైపు తిప్పుకునేందుకు ఆఖరి యత్నాలు చేపట్టింది. వన్నియార్లలో గట్టి పట్టున్న పీఎంకేను, ఇటీవల కన్నుమూసిన విజయకాంత్ స్థాపించిన పార్టీ డీఎండీకేను దరి చేర్చుకుంటే తమకు ఓటు బ్యాంకు గణనీయంగా పెరుగుతుందని భావిస్తున్న కమలదళం.. ఆ రెండు పార్టీలను కూటమిలో చేర్చుకునేందుకు ముమ్మర కసరత్తు చేస్తోంది. ఇందులో భాగంగా ఆ రెండు పార్టీలతో వేర్వేరుగా రహస్య మంతనాలు సాగించినట్లు విశ్వసనీయంగా తెలిసింది. పీఎంకే, డీఎండీకేలు అన్నాడీఎంకేతో రెండు విడతల చర్చలు జరిపినా ఆశించిన సీట్లు లభించలేదు. ఈ రెండు పార్టీలూ రాజ్యసభ సీటు కోసం అన్నాడీఎంకేపై ఒత్తిడి చేశాయి. పీఎంకే అయితే రాజ్యసభ సీటుతోపాటు 2026 అసెంబ్లీ ఎన్నికల తర్వాత అన్నాడీఎంకే కూటమి అధికారంలోకి వస్తే తమ పార్టీకి ఉప ముఖ్యమంత్రి పదవినివ్వాలని, ఆ మేరకు ఒప్పంద పత్రాలపై సంతకం చేయాలని కూడా నిర్బంధించింది. అందుకు అన్నాడీఎంకే ససేమిరా అనడంతో ఆ రెండు పార్టీలు జాతీయ పార్టీ అయిన బీజేపీతో టచ్‌లోకి వెళ్లాయి. ఈ ఎన్నికల్లో మెగా కూటమి ఏర్పాటు చేస్తామని ప్రకటించిన అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) ఆ దిశగా తొలుత తన అనుచరులను పంపి పీఎంకేతో రెండుసార్లు చర్చలు జరిపించారు. ఇదే విధంగా ఈ నెల 1న అన్నాడీఎంకే నాయకులు డీఎండీకే నాయకురాలు ప్రేమలతతో చర్చించారు. ప్రేమలత నివాసానికి వెళ్లిన అన్నాడీఎంకే మాజీ మంత్రులు ఎస్పీ వేలుమణి, తంగమణి, కేపీ అన్బళగన్, బెంజిమెన్ సుదీర్ఘంగా మంతనాలు జరిపారు. అనంతరం డీఎండీకే నేతలు సైతం అన్నాడీఎంకే ప్రధాన కార్యాలయానికి వెళ్లి భేటీ అయ్యారు. ఈ సందర్భంగా డీఎండీకే నాయకులు మీడియాతో మాట్లాడుతూ... ఎట్టకేలకు గెలుపు కూటమిలో చేరామని హర్షం ప్రకటించారు. దీంతో అన్నాడీఎంకే కూటమిలో డీఎండీకే చేరినట్లేనని అన్ని వర్గాలు భావించాయి. కానీ ఆ తరువాత జరిగిన పరిణామాలతో ప్రేమలత మాట మార్చారు. అన్నాడీఎంకేతో జరిగిన చర్చలు మర్యాదపూర్వకమే తప్ప పొత్తును ఖరారు చేసుకోలేదని నర్మగర్భంగా వ్యాఖ్యానించారు. అయితే తాము అడిగినట్లుగా రాజ్యసభ సీటు ఇచ్చేందుకు అన్నాడీఎంకే విముఖత వ్యక్తం చేయడంతో ప్రేమలత పొత్తు నుంచి వెనక్కి తగ్గినట్లు తెలిసింది. ఈ పరిస్థితుల్లో గత రెండు రోజులుగా డీఎండీకే నేతలు బీజేపీ రాష్ట్ర కమిటీ నాయకులతో రహస్యంగా భేటీ అయినట్లు తెలిసింది.







రాందాస్‌తో కేంద్రమంత్రుల భేటీ...

పీఎంకేని బీజేపీ కూటమిలో చేర్చుకునే దిశగా కేంద్ర మంత్రులు సోమవారం ఉదయం ఆ పార్టీ వ్యవస్థాపకుడు డాక్టర్ రాందాస్‌ను టినగర్‌లోని ఆయన నివాసంలో కలుసుకున్నారు. కేంద్రమంత్రులు వీకే సింగ్, కిషన్‌రెడ్డి తదితర జాతీయ నాయకులు ఆదివారం రాత్రి నగరానికి విచ్చేశారు. గిండీలోని స్టార్‌హోటల్‌లో బస చేసిన కేంద్ర మంత్రులను మాజీ ముఖ్యమంత్రి ఒ.పన్నీర్ సెల్వం (ఓపీఎస్) కలుసుకుని చర్చలు జరిపారు. ఆ చర్చల పర్యవసానంగా బీజేపీ కూటమిలో ఓపీఎస్ వర్గం స్థానం పొందింది. ఈ నేపథ్యంలో సోమవారం కేంద్రమంత్రులు వీకే సింగ్, కిషన్‌రెడ్డి, ఎల్. మురుగన్, మాజీ మంత్రి పొన్‌రాధాకృష్ణన్ తదితరులు టినగర్‌లోని రాందాస్ నివాసానికి వెళ్లారు. ఆ సందర్భంగా సీట్ల సర్దుబాట్లపై చర్చ జరిగింది. ఈ నెల 15న ప్రధాని నరేంద్ర మోదీ రాష్ట్ర పర్యటనకు వస్తుండటంతో ఆ లోపున పీఎంకే తన నిర్ణయాన్ని అధికారికంగా ప్రకటిస్తే బాగుంటుందని కేంద్ర మంత్రులు సూచించినట్లు తెలుస్తోంది.

సమాచార దర్శిని

నడిగర్ సంఘానికి విజయ్ రూ.కోటి విరాళం

అడయార్, మార్చి 11: నడిగర్ సంఘ భవన నిర్మాణ పనుల కోసం హీరో విజయ్ తన వంతు సాయంగా కోటి రూపాయల విరాళాన్ని అందజేశారు. ఈ మొత్తానికి సంబంధించిన చెక్కును ఆయన నడిగర్ సంఘానికి పంపించారు. దీంతో హీరో విజయ్‌కు నడిగర్ సంఘం కార్యవర్గ సభ్యులైన అధ్యక్షుడు నాజర్, ప్రధాన కార్యదర్శి విశాల్, కోశాధికారి కార్తీ, ఉపాధ్యక్షులు పూచ్చి మురుగన్, కరుణాస్ ధన్యవాదాలు తెలుపుతూ సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కాగా, ఇటీవల విశ్వనటుడు కమల్ హాసన్ రూ.కోటి విరాళాన్ని అందజేసిన విషయం తెల్సిందే.

చెన్నైకి ఎన్ఎల్సీ సొరంగం నీరు

ఐసిఎఫ్, మార్చి 11: వీరాణం జలాశయం అడుగంటడంతో చెన్నైనగర ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఎన్ఎల్సీ సొరంగం నీరు వాలాజా జలాశయం నుంచి విడుదల చేస్తున్నారు. గత ఏడాది సరిపడా వర్షాలు కురవకపోవడం, కావేరి జలాలు రాకపోవడంతో వీరాణం నీటిమట్టం తగ్గింది. దీంతో రెండు వారాల క్రితం చెన్నైకు నీటి సరఫరా నిలిపివేశారు. ఈ నేపథ్యంలో, వేసవిలో నగర ప్రజల తాగునీటి అవసరాలు పూర్తిచేసేలా నైవేలీ ఎన్ఎల్సీ సొరంగం నుంచి విడుదలయ్యే నీటిని వాలాజా జలాశయానికి తరలించి, అక్కడి నుంచి వీరాణం వైపు పైప్ లైన్ ద్వారా నగరానికి సరఫరా చేస్తున్నారు.

రూ.41 కోట్ల ఆస్తి పన్ను వసూలు

ఐసిఎఫ్, మార్చి 11: చెన్నై కార్పొరేషన్ ఎనిమిది రోజుల్లో రూ.41 కోట్ల ఆస్తి పన్నును వసూలు చేసింది. 15 మండలాల్లో ప్రత్యేక పన్ను వసూలు కేంద్రాలు ఏర్పాటుచేశారు. ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారికి ఈ-మెయిల్, వాట్సాప్ ద్వారా సమాచారం పంపి పన్ను చెల్లించాలంటూ గుర్తు చేస్తున్నామని రెవెన్యూ అధికారులు తెలిపారు.

'సాగరమిత్ర'కు దరఖాస్తుల ఆహ్వానం

ఐసిఎఫ్, మార్చి 11: చెన్నైలో ప్రధానమంత్రి మత్స్య అభివృద్ధి పథకం కింద 'సాగరమిత్ర' అనే 21 తాత్కాలిక మల్టీపర్పస్ సేవా ఉద్యోగుల పోస్టులు ఒప్పంద పద్ధతిలో భర్తీ కానున్నాయి. ఫిషరీస్ సైన్స్, మెరైన్ బయోలజీల్లో యూజీ, పీజీ చేసిన వారికి ప్రాధాన్యం ఉంటుంది. దరఖాస్తుదారులు నగరవాసులై ఉండాలి. ఔత్సాహికులు ఈనెల 15వ తేదిలోపు 'మత్స్యకారుల సంక్షేమ శాఖ సహాయ డైరెక్టర్ కార్యాలయం, సూర్యనారాయణ చెట్టి వీధి, రాయపురం, చెన్నై-13' అనే చిరునామాకు దరఖాస్తులు పంపాలి. వివరాలకు నెం.9384824245, 9384824407లలో సంప్రదించవచ్చు.

5.60 లక్షల మంది ఎగ్జిబిషన్ సందర్శన

ఐసిఎఫ్, మార్చి 11: స్థానిక ఐల్యాండ్ గ్రౌండ్స్‌లో రాష్ట్ర పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 48వ భారత పర్యాటక, వాణిజ్య ప్రదర్శనను 5.60 లక్షల మంది సందర్శించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ ఎగ్జిబిషన్ ప్రారంభించి 60 రోజులు కావస్తున్న నేపథ్యంలో, ఇప్పటివరకు 4.70 లక్షల మంది పెద్దలు, 90 వేల మంది పిల్లలు సందర్శించారు.

వెబ్‌సైట్‌లో ఆలయ స్థలాల వివరాలు

ఐసిఎఫ్, మార్చి 11: ఆలయ భూములు, స్థలాల వివరాలు వెబ్‌సైట్ ద్వారా తెలుసుకొనే సౌకర్యాన్ని హిందూ దేవాదాయ శాఖ కల్పించింది. ఆలయ భూముల సర్వే పనులు 2021లో జరిగాయి. ఇప్పటివరకు 1.62 లక్షల ఎకరాల భూములు సర్వే చేసి మ్యాప్‌లు సిద్ధం చేశారు. తొలివిడతగా 29 జిల్లాల్లో ఉన్న 146 ఆలయాలకు చెందిన 2,015.17 ఎకరాల భూముల ఫోటోలు, భౌగోళిక వివరాలు https://hrce.tn.gov.inలో దేవాదాయ శాఖ విడుదల చేసింది.

ముస్లింలుగా మారిన వారికి బీసీ సర్టిఫికెట్

ఐసిఎఫ్, మార్చి 11: ఇస్లాం మతాన్ని స్వీకరించే బీసీ, ఎంబీసీ, ఎస్సీలను ముస్లిం బీసీలుగా ప్రకటిస్తూ కుల ధృవీకరణ పత్రం అందజేయాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రంలో 2012 వరకు ఇతర మతాల నుంచి ఇస్లాం స్వీకరించేవారికి కమ్యూనిటీ సర్టిఫికెట్‌ను ముస్లిం రావుద్దర్, లబ్బై పేరుతో ఇచ్చేవారు. ఆ విధానాన్ని మారుస్తూ ప్రభుత్వం కొత్తగా మార్పు చేసింది. దీని ద్వారా ముస్లింలు గా మారిన వారికి విద్య, ఉద్యోగావకాశాల్లో 3.5 శాతం రిజర్వేషన్లు లభించే అవకాశముందని అధికారులు తెలిపారు.

లైసెన్స్ రెన్యువల్ చేయని దుకాణాల సీజ్

ఐసిఎఫ్, మార్చి 11: స్థానిక కోయంబేడు మార్కెట్లో లైసెన్స్ రెన్యువల్ చేయని దుకాణాలను సీజ్ చేస్తామని అధికారులు హెచ్చరించారు. దుకాణాలకు 2021-24 వరకు ఉన్న లైసెన్స్ గడువు ఈ నెల 30వ తేదీతో ముగియనుంది. వచ్చే మూడేళ్లకు రెన్యువల్ చేయాల్సి ఉంది. నిబంధనలు ఉల్లంఘించే దుకాణాలను సీజ్ చేస్తామని అధికారులు హెచ్చరించారు.

మద్యం దుకాణాల్లో 'పే'టీఎం

ఐసిఎఫ్, మార్చి 11: టాస్మాక్ మద్యం దుకాణాల్లో పేటీఎం ద్వారా నగదు వసూలు ప్రారంభమైంది. ఆన్‌లైన్‌పేమెంట్ సౌకర్యం కల్పించాలనే విజ్ఞప్తి మేరకు మద్యం దుకాణాల్లో క్యూ ఆర్ కోడ్, స్వైపింగ్ మెషిన్, పేటీఎం ద్వారా నగదు వసూలుకు టాస్మాక్ సంస్థ చర్యలు చేపట్టింది. ఆ ప్రకారం, కాంచీపురం నార్త్ జిల్లా పరిధిలో ఉన్న 132 మద్యం దుకాణాల్లో ఈ సౌకర్యాన్ని కల్పించారు. త్వరలో ఈ విధానం విస్తరిస్తామని టాస్మాక్ అధికారులు తెలిపారు.

20 ప్రాంతాల్లో కార్చిచ్చు

ఐసిఎఫ్, మార్చి 11: నీలగిరి, కృష్ణగిరి, వేలూరు, కన్నియాకుమారి జిల్లాల్లోని 20 ప్రాంతాల్లో ఆదివారం కార్చిచ్చు ఏర్పడిందని అటవీ శాఖ అధికారులు తెలిపారు. కృష్ణగిరి జిల్లాలో 10 ప్రాంతాలు, వేలూరులో 8, నీలగిరి, కన్నియాకుమారి సహా 20 ప్రాంతాల్లో కార్చిచ్చు ఏర్పడింది. ఆయా జిల్లాల అగ్నిమాపక సిబ్బంది మంటలు ఆర్పుతున్నట్లు అటవీ శాఖ తెలియజేసింది.

సీత్తంజేరిలో...

ఊత్తుకోట సమీపం సీత్తంజేరి వెంగల్ రహదారిలో రిజర్వు ఫారెస్టు ఉంది. ఆదివారం కల్పట్టు ప్రాంతంలో కార్చిచ్చు ఏర్పడిందని రెడ్‌హిల్స్ అటవీ శాఖ అధికారులు తెలిపారు. ఈ మార్గంలో వెళ్లిన వాహనచోదకులు అందించిన సమాచారంతో తేర్వాయ్ సిప్కాట్ అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలు అదుపుచేశారు. అప్పటికే 10 కి.మీ మేర మంటలు వ్యాపించి చెట్లు దగ్ధమయ్యాయని అధికారులు తెలిపారు.

ఎన్నూర్ కొత్త థర్మల్ విద్యుత్ కేంద్రంలో 130 మెగావాట్ల విద్యుదుత్పత్తి

ప్యారీస్, మార్చి 11: ఉత్తర చెన్నై పరిధిలోని ఎన్నూరులో కొత్తగా నిర్మించిన థర్మల్ విద్యుత్ కేంద్రంలో ప్రస్తుతం 130 మెగావాట్ల విద్యుదుత్పత్తి జరిగిందని తమిళనాడు విద్యుత్ బోర్డు (టీఎన్ఈబీ) అధికారులు తెలిపారు. ఎన్నూరు ప్రాంతంలో రాష్ట్రప్రభుత్వ నిర్వహణలోని థర్మల్ విద్యుత్ కేంద్రంలో ఇప్పటికే రెండు ఉత్పత్తి కేంద్రాలుండగా మూడో కేంద్రం నిర్మాణపనులను 2010లో అప్పటి సీఎం కరుణానిధి ప్రారంభించారు. కోవిడ్ కారణంగా నిర్మాణపనుల్లో జాప్యం ఏర్పడింది. ఈ నేపథ్యంలో, సీఎం స్టాలిన్ గత వారం ప్రారంభించిన కొత్త థర్మల్ కేంద్రంలో ప్రస్తుతం 130 మెగావాట్ల విద్యుదుత్పత్తి జరిగినట్లు అధికారులు తెలిపారు.

ఆకట్టుకున్న సత్యేంద్రస్వామి ఆధ్యాత్మిక ప్రవచనం

చెన్నై, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక పెరంబూరులోని ఎస్కేఎన్ఎస్పీఎంసీ వివేకానంద విద్యాలయ సీనియర్ సెకండరీ స్కూలులో పంచశక్తి పీఠాధిపతి జగద్గురు "సత్యేంద్రస్వామి నిర్వహించిన ఆధ్యాత్మిక ప్రవచన కార్యక్రమం భక్తులను బాగా ఆకట్టుకుంది. శ్రీఓం సభా ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో భక్తులడిగిన ఆధ్యాత్మిక ప్రశ్నలకు సత్యేంద్ర స్వామి సమాధానాలిచ్చారు. ఉత్తర చెన్నై జిల్లా వ్యాపారుల సంఘం నిర్వాహకులు డి.పద్మనాభన్ అన్నాచ్చి, వ్యాసర్పాడి వివేకానంద స్కూలు కరస్పాండెంట్ ఎస్.రామచంద్రన్, పళని ఆలయం ట్రస్టు బోర్డు చైర్మన్ ఎల్ తిరునావుక్కరసు, సంస్కార భారతి మాతృశక్తి ప్రముఖ్ ఎస్.రాధ, పారిశ్రామికవేత్త వి.శ్రీనివాసన్, పెరంబూరు వివేకానంద విద్యాలయ కరస్పాండెంట్ కేఈ శ్రీనివాసన్, ప్రిన్సిపాల్ శుభశ్రీ, జనకళ్యాణ్ సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుమారు 500 మంది భక్తులకు అన్నదానం నిర్వహించారు.



సత్యేంద్రస్వామిని సత్కరిస్తున్న రామచంద్రన్, శ్రీనివాసన్ తదితరులు

ముగిసిన ఫెయిర్‌ప్రో



అడయార్, మార్చి 11: ది కాన్ఫెడరేషన్ ఆఫ్ రియల్ ఎస్టేట్ డెవలపర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా(క్రెడాయ్) ఆధ్వర్యంలో "ఫెయిర్‌ప్రో 2024" పేరుతో జరిగిన రియల్ ఎస్టేట్ ఎగ్జిబిషన్ ముగిసింది. నందంబాక్కంలోని ట్రేడ్ సెంటరులో ఈ నెల 8 నుంచి 10వ తేదీ మధ్య జరిగిన ఈ ప్రదర్శనను సుమారు 31 వేల మంది సందర్శించారు. ఇందులో రూ.260 కోట్ల విలువ చేసే ప్రాపర్టీస్ బుకింగ్స్ జరిగాయి. ఈ ఎగ్జిబిషన్ విజయవంతం కావడంతో నిర్వాహకులు హర్షం వ్యక్తం చేస్తూ, రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ రంగం పురోగమిస్తుందని చెప్పడానికి ఈ బుకింగ్సే నిదర్శనమని వారు అభిప్రాయపడ్డారు. మూడు రోజుల పాటు నిర్వహించిన ఈ ప్రదర్శన సంతృప్తికరంగా ముగిసిందని చెప్పడానికి సంతోషిస్తున్నట్లు క్రెడాయ్ ప్రెసిడెంట్ ఎస్.శివగురునాథన్ విడుదల చేసిన ఒక పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు.

జువైనల్ హోం విద్యార్థుల ఆత్మహత్య బెదిరింపు

పెరంబూర్, మార్చి 11: చెంగల్పట్టులోని జువైనల్ హోం భవనం ఎక్కి విద్యార్థులు ఆత్మహత్యకు పాల్పడతామని బెదిరించిన వ్యవహారం కలకలం రేపింది. నేరాలకు పాల్పడే మైనర్లను ఈ జువైనల్ హోంకు తరలిస్తుంటారు. ఈ నేపథ్యంలో, సోమవారం ఉదయం హఠాత్తుగా భవనం పైకి చేరుకున్న 9 మంది విద్యార్థులు ఆత్మహత్యకు పాల్పడుతున్నట్లు బెదిరింపులకు దిగారు. వారిలో ఒకరు సమీపంలోని సెల్ టవర్ ఎక్కడం కలకలం రేపింది. ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఒకే గదిలో బంధించకుండా హోం ప్రాంగణంలో స్వేచ్ఛగా తిరిగేందుకు, ఆటలు ఆడుకొనేందుకు అనుమతించాలని వారు డిమాండ్ చేశారు. వారితో పిల్లల సంక్షేమ విభాగం, పోలీసు అధికారులు చర్చలు జరుపుతున్నారు.

యువకుడి హత్య కేసు... ఐదుగురికి యావజ్జీవం

అడయార్, మార్చి 11: కన్నియాకుమారి జిల్లా బూతపాండి సమీపంలో యువకుడిని హత్య చేసిన కేసులో అన్నా తమ్ముడితోపాటు మొత్తం ఐదుగురు నిందితులకు నాగర్‌కోయిల్ కోర్టు జీవిత కారాగార శిక్షను విధిస్తూ సోమవారం తీర్పునిచ్చింది. బూతపాండి సమీపంలోని తిట్టువిలైకి చెందిన నేశమణి, జ్ఞానశిఖామణి అనే ఇద్దరు బంధువులకు గొడవ జరిగింది. ఇది పెద్దది కావడంతో నేశమణి కుమారులు ముత్తురాజ్, గోపాలకృష్ణన్‌పై జ్ఞానశిఖామణి కుమారులు సెల్వన్, సెల్వసింగ్, తమ స్నేహితులు సురేష్, రసిత్, దురై సహా మొత్తం 9 మంది కలిసి దాడి చేశారు. ఈ దాడిలో ముత్తురాజ్ ఘటనా స్థలిలోనే ప్రాణాలు కోల్పోయాడు. దీనిపై స్థానిక పోలీసులు కేసు నమోదు చేయగా, నాగర్‌కోయిల్ కోర్టులో విచారణ జరిగింది. పోలీసులు సమర్పించిన ఆధారాలను పరిశీలించిన కోర్టు సురేష్, రసిత్ అనే ఇద్దరు అన్నదమ్ములతో పాటు మొత్తం ఐదుగురికి జీవిత కారాగార శిక్ష విధిస్తూ తీర్పునిచ్చింది.

సమయపురం ఆలయంలో అగ్నిప్రమాదం

● ఇద్దరు అర్చకులకు గాయాలు

అడయార్, మార్చి 11: తిరుచ్చి జిల్లాలో ప్రసిద్ధ ఆలయమైన సమయపురం మారియమ్మన్ ఆలయంలో ఆదివారం ఉదయం అగ్నిప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఇద్దరు అర్చకులు గాయపడ్డారు. ఈ ఆలయంలో ఆదివారం పుష్పాభిషేకం వేడుకలు ప్రారంభమయ్యాయి. ఈవేడుక 28 రోజుల పాటు సాగుతుంది. ప్రారంభరోజైన ఆదివారం పూజారులు దీపారాధన వేడుక తెల్లవారుజామున 5.40 గంటల సమయంలో నిర్వహించారు. ఆ సమయంలో దీపారాధన భక్తులకు చూపిస్తుండగా, పక్కనే ఉన్న పందిరికి నిప్పు అంటుకుంది. ఈ మంటలు శరవేగంగా నలువైపులా వ్యాపించడంతో పందిరి కాలిపోయింది. ఇందులో చిక్కుకున్న అర్చకుల్లో ఇద్దరికి గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపకదళ సిబ్బంది అక్కడకు చేరుకుని ఫైరింజన్ల సాయంతో మంటలను ఆర్పివేశాయి.

పరందూర్ విమానాశ్రయంలో రెండు మెట్రో రైల్వేస్టేషన్లు

ప్యారీస్, మార్చి 11: కాంచీపురం జిల్లా శ్రీపెరుంబుదూర్ సమీపంలోని పరందూర్‌లో ఏర్పాటు కానున్న విమానాశ్రయ ప్రాంగణంలో రెండు మెట్రో రైల్వేస్టేషన్లు కూడా నిర్మితం కానున్నట్లు అధికారులు తెలిపారు. రాజధాని నగరం చెన్నైకి సమీపంలో ఉన్న పరందూర్‌లో అంతర్జాతీయ స్థాయి రెండో విమానాశ్రయం ఏర్పాటు కానుంది. దీనిపై ప్రభుత్వ సంస్థ టిడ్కో మ్యాప్ కూడా ఇటీవల విడుదల చేసింది. అందులో ఒక మెట్రో రైల్వేస్టేషన్ విమానాశ్రయానికి సమీపంలోను, మరో రైల్వేస్టేషన్ ప్రాంగణం ప్రవేశద్వారం సమీపంలో ఏర్పాటు కానున్నాయి. రూ.10,712 కోట్లతో రూపొందించిన ప్రణాళికను విమానాశ్రయ ప్రాజెక్ట్ అధికారులు రాష్ట్రప్రభుత్వానికి అందజేశారు. పూందమల్లి, నజరేత్‌పేట చెక్‌పోస్ట్, చెంబరంబాక్కం, తిరుమిళిసై టౌన్‌షిప్, పాపన్‌సత్రం, చెట్టిమేడు, తండలం, సిప్కాట్, ఇరుంగాట్టుకోట, పొన్నలూరు, శ్రీపెరుంబుదూర్, పట్టునూలుసత్రం, సుంకువారిసత్రం, సంతవేలూరు, పిల్లైసత్రం, సీర్వలూరు, పరందూర్ విమానాశ్రయం స్టేషన్లుం టాయి. కొత్త విమానాశ్రయానికి సులువుగా చేరుకొనేలా రెండు మెట్రో రైల్వేస్టేషన్లు నిర్మించాలని నిర్ణయించినట్లు అధికారులు తెలిపారు.



గుడియాత్తం అరవట్ల పంచాయతీ పాస్ మాల్‌పెండా గ్రామంలోని పంచాయతీ యూనియన్ ప్రాథమిక పాఠశాలల్లో ఏర్పాటు కానున్న పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సుబ్బులక్ష్మి

దివ్యాంగురాలికి సమాజ సేవకుడి చేయూత

వేలూరు, మార్చి 11: స్థానిక కన్నికాపురానికి చెందిన రాజ్యలక్ష్మి దివ్యాంగురాలు. పేదరికంతో కుటుంబ పోషణ సాగించలేక ఇబ్బందులు పడుతున్నారు. ఆమె వ్యాపారం చేసుకొనేందుకు సహకరించాలని పలువురికి విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన రంగాపురానికి చెందిన ఐటీ ఉద్యోగి, సమాజ సేవకుడు దినేష్ శరవణన్... రాజ్యలక్ష్మి చిరువ్యాపారం చేసేలా తోపుడు బండి అందజేశారు. అలాగే, ఆమెకు వినికిడి మెషిన్, కిరాణా వస్తువులు అందజేశారు.


రాజ్యలక్ష్మికి తోపుడు బండి అందజేస్తున్న దినేష్ శవరణన్

పాఠశాల విద్యాశాఖ ఫేస్‌బుక్ హ్యాక్

పెరంబూర్, మార్చి 11: రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ అధికార ఫేస్‌బుక్ హ్యాక్ అయింది. గుర్తుతెలియని వ్యక్తులు ఈ చర్యలకు పాల్పటినట్లు తెలుస్తోంది. పాఠశాల విద్యాశాఖ ఫేస్‌బుక్‌ను సుమారు లక్ష మంది ఫాలో అవుతున్నారు. పాఠశాల విద్యాశాఖ ముఖ్యమైన ప్రకటనలు, ఉపాధ్యాయుల అభిప్రాయాలు, విద్యాబోధనలో చేపట్టాల్సిన మార్గదర్శకాలు తదితరాలు ఈ ఫేస్‌బుక్‌లో పోస్ట్ చేస్తుంటారు. ఈ నేపథ్యంలో, ఆదివారం నుంచి ఈ ఫేస్ బుక్ హ్యాక్ అయినట్లు గుర్తించారు. విజయ్, విజయ్ సేతుపతి కలసి నటించిన 'మాస్టర్' చిత్రానికి సంబంధించిన సన్నివేశాలు పాఠశాల విద్యాశాఖ వెబ్‌సైట్‌లో వెలువడుతున్నాయి. ఈ విషయమై పాఠశాల విద్యాశాఖ అధికారులు డీజీపీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు.

జల్లికట్టు అనుమతులకు కలెక్టర్లకు అధికారం లేదు

● హైకోర్టు మదురై బెంచ్

పెరంబూర్, మార్చి 11: జల్లికట్టు పోటీలు నిర్వహించేందుకు ఉత్తర్వులు జారీ చేసే అధికారం జిల్లా కలెక్టర్లకు లేదని హైకోర్టు మదురై బెంచ్ స్పష్టం చేసింది. విరుదునగర్ జిల్లా వత్తిరాయిరుప్పులో జల్లికట్టు పోటీలు నిర్వహించేలా ఉత్తర్వులు జారీ చేయాలని కోరుతూ హైకోర్టు మదురై బెంచ్‌లో పిటిషన్ దాఖలైంది. ఎంపిక చేసిన ప్రాంతాల్లో మాత్రమే జల్లికట్టు పోటీలు నిర్వహణకు అనుమతులు జారీ చేసినట్లు జీవోలో పేర్కొన్నారని రాష్ట్రప్రభుత్వం తరపున దాఖలైన అఫిడవిట్‌లో పేర్కొనింది. ప్రభుత్వ వాదన పరిగణలోకి తీసుకున్న న్యాయస్థా నం, జీవో లేని ప్రాంతాల్లో ఎద్దులు వదిలే పోటీలు, జల్లికట్టు పోటీల నిర్వహణ కు అనుమతులు ఇవ్వలేమని, అలాగే, పోటీల నిర్వహణకు అనుమతించాలని జిల్లా కలెక్టర్లకు ఉత్తర్వులు జారీ చేయలేమంటూ, పిటిషన్ తోసిపుచ్చింది.

ఒక్కో పాఠ్యాంశానికి ఒక్కో ఉపాధ్యాయుడు

● ప్రభుత్వ అనుమతి

పెరంబూర్, మార్చి 11: రాష్ట్రంలో 1నుంచి 5వ తరగతి వరకు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు, 1 నుంచి 8వ తరగతి వరకు ఉన్న మాధ్యమిక పాఠశాలల్లో 35 మంది విద్యార్థులకు ఒక ఉపాధ్యాయుడు చొప్పున నియమిస్తున్నారు. ప్రభుత్వ ప్రాథమిక, మాధ్యమిక పాఠశాలల్లో అధికంగా 100 మంది విద్యార్థులు మాత్రమే ఉండడంతో, ఒకటి, రెండు పాఠ్యాంశాలకు మాత్రమే ఉపాధ్యాయులున్నారు. మిగిలిన పాఠ్యాంశాలకు ఉపాధ్యాయులు లేకపోవడంతో విద్యార్థుల ఉత్తీర్ణత శాతం తగ్గుతోందని విద్యా నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఈ సమస్య పరిష్కరించేలా రాబోయే కాలంలో 100 మందికి పైగా ఉన్న పాఠశాలల్లో, ఒక్కో పాఠ్యాంశానికి ఒక్కో ఉపాధ్యాయుడిని నియమించవచ్చని ప్రాథమిక విద్య డైరెక్టరేట్‌కు పాఠశాల విద్యాశాఖ అనుమతులు జారీచేసింది. దీంతో, రాబోయే విద్యా సంవత్సరం నుంచి పాఠ్యాంశాల వారీగా ఉపాధ్యాయుల వివరాలతో కూడిన జాబితా సిద్ధం చేసి, అవసరమైన పాఠ్యాంశాలకు కొత్త ఉపాధ్యాయులను నియమించే చర్యలు చేపట్టినట్లు ప్రాథమిక విద్య డైరెక్టరేట్ తెలిపింది.

● శాసనసభ సమావేశాల ప్రత్యక్ష ప్రసారం కేసు

హైకోర్టును గడువు కోరిన రాష్ట్ర ప్రభుత్వం

పెరంబూర్, మార్చి 11: శాసనసభ సమావేశాల ప్రత్యక్ష ప్రసారంపై మద్రాసు హైకోర్టులో రాష్ట్రప్రభుత్వం అఫిడవిట్ దాఖలు చేసింది. సమావేశాలు ప్రత్యక్ష ప్రసారం చేసేలా ప్రభుత్వానికి ఉత్తర్వులు జారీ చేయాలని కోరుతూ 2015లో లోక్ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు జగదీశ్వరన్, 2023లో అప్పటి డీఎండీకే అధ్యక్షుడు విజయకాంత్, అన్నాడీఎంకే విప్ ఎస్పీ వేలుమణి వేర్వేరు పిటిషన్లు దాఖలు చేశారు. ఈ పిటిషన్లను సోమవారం ప్రధాన న్యాయమూర్తి ఎస్వీ గంగాపూర్‌వాలా, న్యాయమూర్తి భరత్ చక్రవర్తిలతో కూడిన ధర్మాసనం విచారించింది. ఆ సమయంలో ప్రభుత్వ అడ్వొకేట్ జనరల్ పీఎస్ రామన్ హాజరై, శాసనసభ సమావేశాల ప్రత్యక్ష ప్రసారం వ్యవహారంలో, ఇతర రాష్ట్రాలు అవలంబిస్తున్న విధానాలను పరిశీలిస్తున్నామన్నారు. ఇప్పటివరకు 7 రాష్ట్రాల విధానాలు సేకరించామని, మిగిలిన రాష్ట్రాల సమాచారం కోసం ఎదురు చూస్తున్నామని తెలిపారు. రాష్ట్ర శాసనసభ సమావేశాల ప్రత్యక్ష ప్రసారంలో రాష్ట్రప్రభుత్వం సిద్ధాంతపరమైన నిర్ణయం తీసుకుంటుందని వాదించారు. ప్రభుత్వ వాదన పరిగణలోకి తీసుకున్న ధర్మాసనం, ప్రతిపక్ష సభ్యులు మాటలను ప్రత్యక్ష ప్రసారం చేయడం లేదని పిటిషన్‌దారుల ఆరోపణగా ఉందన్నారు. ప్రత్యక్ష ప్రసారం సాధ్యం కాకపోయినా, 5 నిమిషాలు ఆలస్యంగా కూడా ప్రసారం చెయ్యవచ్చని, సభ నిషేధించే దృశ్యాలు తొలగించి కూడా ప్రసారం చేయవచ్చు అంటూ అభిప్రాయం వ్యక్తం చేసిన ధర్మాసనం, తదుపరి విచారణ ఏప్రిల్ 16వ తేదీకి వాయిదా వేసింది.

భూకబ్జా కేసులో సినీ నటుడి సహా ఇద్దరి అరెస్టు

అడయార్, మార్చి 11: స్థానిక తిరువొత్తియూరులో రూ.2 కోట్ల విలువైన భూకబ్జా కేసులో సినీ నటుడి సహా ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. 2022లో నగరానికి చెందిన అలోక్ అగర్వాల్ అనే వ్యాపారవేత్త నగర పోలీస్ కమిషనర్ కార్యాలయంలో ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టారు. తిరువొత్రియూరులో తన భాగస్వామి పేరుమీద ఉన్న 16 గ్రౌండ్ల స్థలానికి నకిలీ పత్రాలు సృష్టించి కబ్జా చేసినట్లు అందులో పేర్కొన్నారు. దీనిపై విచారణ చేపట్టిన పోలీసులు... అడయార్ ప్రాంతానికి చెందిన సినిమా నిర్మాత, అమీర్‌జాన్, ఆయన స్నేహితులు రాయపురానికి చెందిన షాజహాన్ కలిసి నకిలీ దస్తావేజులు సృష్టించారు. అలోక్ అగర్వాల్ భాగస్వామిగా మరో వ్యక్తిని రిజిస్ట్రార్ కార్యాలయంలో చూపి ఆ స్థలాన్ని తమ పేరుపై రిజిస్టర్ చేయించుకున్నట్లు తేలింది. దీంతో పోలీసులు వారిద్దరిని అరెస్టు చేశారు.

బైక్‌ను ఢీకొన్న లారీ: కార్మికుడి మృతి

ప్యారీస్, మార్చి 11: స్థానిక ఆవడి సమీపంలోని పట్టాభిరాం ఫ్లై ఓవర్‌పై లారీ ఢీకొనడంతో మోటరు సైకిల్‌పై వెళ్తున్న కార్మికుడు మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. పట్టాభిరాం చార్లెస్ నగర్‌కు చెందిన గణేశ్(34) పెరంబూర్‌లో ఉన్న ఓ ప్రైవేటు సంస్థలో పని చేస్తున్నారు. శనివారం రాత్రి విధులు ముగించుకొని బైక్‌లో ఇంటికి బయల్దేరిన గణేశ్ పట్టాభిరాం ఫ్లై ఓవర్‌పై వెళుతున్న సమయంలో ఎదురుగా వేగంగా వచ్చిన లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన గణేశ్ అక్కడికక్కడే మృతిచెందారు.ఆవడి ట్రాఫిక్ పోలీసులు మృతదేహాన్ని కీల్పాక్కం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. తిరుత్తణి పెరియార్‌నగర్‌కు చెందిన లారీ డ్రైవర్ పార్థసారథిని అరెస్ట్ చేశారు.

ఏసీఎస్ ఉచిత కల్యాణ మండపానికి శంకుస్థాపన

వేలూరు, మార్చి 11: జిల్లాలోని పేదల కోసం ఉచిత కల్యాణమండపానికి శంకుస్థాపన కార్యక్రమం ఆదివారం జరిగింది. పుదియ నీతి కట్చి వ్యవస్థాపక అధ్యక్షుడు ఏసీ షణ్ముగం తన సొంత ఖర్చులతో 27 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో కల్యాణ మండపం, ఉచిత వైద్య కేంద్రం, ఉద్యోగావకాశాల సమాచారం కేంద్రం తదితర భవన నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో సినీ దర్శకుడు, నటుడు సుందర్, జాతీయ మహిళా కమిషన్ సభ్యురాలు, బీజేపీ నాయకురాలు ఖుష్బూ తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో ఏసీ షణ్ముగం, సుందర్, ఖుష్బూ తదితరులు

ప్రధాని మోదీ చెప్పేవన్నీ అబద్ధాలే

● కాంగ్రెస్ ఎంపీ కార్తీ చిదంబరం

ప్యారీస్, మార్చి 11: ప్రధాని నరేంద్ర మోదీ చెప్పేవన్నీ అబద్ధాలేనని, లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలను మభ్యపెట్టి ఓట్లు రాబట్టుకొనేందుకు ఆచరణకు సాధ్యం కాని పథకాలను ప్రకటిస్తున్నారని శివగంగ కాంగ్రెస్ పార్లమెంటు సభ్యుడు కార్తీ చిదంబరం పేర్కొన్నారు. రాయపేటలోని టీఎన్‌సీసీ కార్యాలయం సత్యమూర్తి భవన్‌లో కార్తీ చిదంబరం సోమవారం మీడియాతో మాట్లాడారు. దేశంలో మతసామరస్యాన్ని అణగదొక్కి హిందూ రాజ్యంగా ప్రకటించాలన్నదే ప్రధాని మోదీ లక్ష్యమని, కేంద్రంలో బీజేపీ మూడో సారి అధికారంలోకి వస్తే దేశానికి ముప్పు వాటిల్లే అవకాశముందన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కానున్న నేపథ్యంలో, అరుణ్ గోయల్ రాజీనామా చేయడంపై కేంద్రప్రభుత్వం ఎలాంటి వివరణ ఇవ్వలేదన్నారు. ఎలక్టోరల్ బాండ్లను దాఖలు చేయాల్సిందిగా ఎస్బీఐకు సుప్రీంకోర్టు ఉత్తర్వులు జారీ చేసిందని, ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో లోక్‌సభకు ఎన్నికలు జరుగనున్నాయన్నారు. కేంద్రప్రభుత్వ పథకాలకు డీఎంకే ప్రభుత్వం స్టిక్కర్లు అంటించి ప్రజలను మోసం చేస్తోందని ప్రధాని మోదీ పేర్కొనడంలో నిజం కాదన్నారు. ఇక మోదీ చెప్పేవన్నీ అబద్ధాలేనని కార్తీ చిదంబరం వ్యాఖ్యానించారు.

బీజేపీ ఒత్తిడి వల్లే అరుణ్ గోయల్ రాజీనామా

● డీఎంకే ఎంపీ టీఆర్ బాలు

ప్యారీస్, మార్చి 11: బీజేపీ ఒత్తిడి వల్లే కేంద్ర ఎన్నికల కమిషనర్ అరుణ్ గోయల్ రాజీనామా చేసి ఉంటారని డీఎంకే పార్లమెంటు సభ్యుడు టీఆర్ బాలు అనుమానం వ్యక్తం చేశారు. అంబత్తూర్ నియోజకవర్గ పరిధిలో తన నియోజకవర్గ అభివృద్ధి నిధుల నుంచి పలు కొత్త పథకాలకు ఆదివారం బాలు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఎన్నికల కమిషన్‌ను బీజేపీ ప్రభుత్వం తనకు అనుకూలంగా పనిచేయాలని ఒత్తిడి చేసిన కారణం వల్లే అరుణ్ గోయల్ తన పదవి నుంచి వైదొలిగి ఉంటారని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఇక లోక్‌సభ ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించగలిగే అధికారిని ఎంపిక చేసేందుకు 'ఇండియా' కూటమి చర్యలు చేపడుతుందని టీఆర్ బాలు తెలిపారు.

లోక్‌సభ ఎన్నికల్లో డీఎంకే విజయం తథ్యం

● నటి కస్తూరి ధీమా

అడయార్, మార్చి 11: రానున్న లోక్‌సభ ఎన్నికల్లో అధికార డీఎంకే సారథ్యంలోని కూటమి విజయం తథ్యమని సినీ నటి కస్తూరి ధీమా వ్యక్తం చేశారు. ఇదే విషయంపై ఆమె సోమవారం విలేకరులతో మాట్లాడుతూ... రాష్ట్రంలో ఎలాంటి ఒడిదుడుకులు లేకుండా సాఫీగా సాగిపోతున్న ఏకైక రాజకీయ పార్టీ డీఎంకే అని చెప్పారు. ఆ పార్టీ సారథ్యంలోని కూటమి పార్టీలకు సీట్ల కేటాయింపు కూడా సుహృద్భావ వాతావరణంలో ముగిసిందన్నారు. డీఎంకేతో పాటు భాగస్వామ్య పార్టీలు ఒకే మాట, ఒకే బాటగా ప్రయాణం చేస్తున్నాయన్నారు. ఇక జయలలిత సీఎంగా ఉన్న సమయంలో 'మోదీయా లేక ఈ లేడీనా' అనే నినాదంతో ఎన్నికలకు వెళ్లి విజయం సాధించారన్నారు. కానీ, ఇపుడు ఆ పరిస్థితి అన్నాడీఎంకేలో లేదన్నారు. ఈ విషయాన్ని తాను బల్లగుద్ది చెబుతానన్నారు. మీడియా ముందు మాట్లాడేవారు విషయ పరిజ్ఞానంతో రావాలని ఆమె సలహా ఇచ్చారు.

బీజేపీకి బేషరతు మద్దతు: టీటీవీ దినకరన్

పెరంబూర్, మార్చి 11: త్వరలో జరగనున్న లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ కూటమికి ఎలాంటి నిబంధనలు లేకుండా బేషరతు మద్దతు ఇవ్వనున్నట్లు అమ్మా మక్కల్ మున్నేట్ర కళగం ప్రధాన కార్యదర్శి టీటీవీ దినకరన్ తెలిపారు. తిరుచ్చిలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, బీజేపీ కూటమిలో చేరే విషయమై రెండు, మూడు నెలలుగా చర్చలు జరుగుతున్నాయన్నారు. రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ కూటమి విజయానికి పార్టీ కార్యకర్తలు అవిశ్రాంతంగా శ్రమిస్తారని దినకరన్ తెలిపారు.

సెంథిల్ బాలాజి రిమాండ్ పొడిగింపు

పెరంబూర్, మార్చి 11: మాజీ మంత్రి సెంథిల్ బాలాజి రిమాండ్ 25వ సారి న్యాయస్థానం పొడిగించింది. చట్టవ్యతిరేక నగదు బదిలీ నిషేధ చట్టం కింద ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం అరెస్ట్ చేసిన సెంథిల్ బాలాజి... పుళల్ కేంద్ర కారాగారంలో రిమాండ్‌లో ఉన్నారు. తనను ఈ కేసు నుంచి విడిపించాలని కోరుతూ సెంథిల్ బాలాజి తరపున దాఖలైన పిటిషన్ చెన్నై ప్రిన్సిపల్ సెషన్స్ కోర్టులో విచారణలో ఉంది. ఈ నేపథ్యంలో, సెంథిల్ బాలాజి రిమాండ్ గడువు సోమవారం ముగియడంతో, ఆయన్ను పుళల్ జైలు నుంచే వీడియో కాన్ఫరెన్స్ ద్వారా న్యాయమూర్తి ఎస్.అల్లి ఎదుట హాజరుపరచగా, ఈనెల 13 వరకు రిమాండ్ పొడిగిస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

రాజాత్తి అమ్మాళ్‌కు అస్వస్థత

పెరంబూర్, మార్చి 11: దివంగత మాజీ ముఖ్యమంత్రి కరుణ సతీమణి రాజాత్తి అమ్మాళ్ అస్వస్థత గురై నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేరారు. స్థానిక సీఐటీ కాలనీలోని కుమార్తె కనిమొళి ఇంట్లో రాజాత్తి అమ్మాళ్ నివసిస్తున్నారు. ఆమె అజీర్ణం, కడుపు నొప్పి సమస్యలతో బాధపడుతుండగా, గత ఏడాది జర్మనీలోని ప్రసిద్ధి ఆసుపత్రిలో 20 రోజులు చికిత్సలు పొందారు. ఈ నేపథ్యం లో, ఆదివారం రాత్రి రాజాత్తి అమ్మాళ్ హఠాత్తుగా అస్వస్థతకు గురికావడంతో, గ్రీమ్స్ రోడ్డులోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. వృద్ధాప్య కారణంగా అస్వస్థతకు గురయ్యారని, తగిన చికిత్సల అనంతరం త్వరలోనే డిశ్చార్జి చేస్తామని ఆసుపత్రి వైద్యులు తెలిపారు.

అన్నామలైతో శరత్‌కుమార్ భేటీ

● సీట్ల సర్దుబాటుపై చర్చలు



కిషన్‌రెడ్డి, వీకే సింగ్, అన్నామలైతో శరత్‌కుమార్

పెరంబూర్, మార్చి 11: రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ కూటమిలో చేరినట్లు ఆలిండియా సమత్తువ మక్కల్ కట్చి అధ్యక్షుడు శరత్ కుమార్ ప్రకటించారు. డీఎంకే, అన్నాడీఎంకే కూటములకు దీటుగా బలమైన కూటమి ఏర్పాటులో బీజేపీ నిమగ్నమైంది. ఇప్పటికే టీఎంసీ, ఐజేకే, పుదియ నీతి కట్చి సహా ఆరు పార్టీలు ఈ కూటమిలో చేరాయి. ఈ క్రమంలో, బీజేపీ కూటమిలో చేరనున్నట్లు ఇదివరకే ప్రకటించిన శరత్‌కుమార్ సోమవారం టి.నగర్‌లోని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యాలయానికి వచ్చి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై, కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, వీకే సింగ్‌తో శరత్‌కుమార్ భేటీ అయ్యారు. కూటమిలో సీట్ల సర్దుబాటుకు సంబంధించిన చర్చలు జరిగాయని, ఒకటి, రెండు రోజుల్లో సీట్ల కేటాయింపుపై అధికారికంగా ప్రకటిస్తామని శరత్‌కుమార్ తెలిపారు.

ఐఐటీ ప్రాంగణంలో గంజాయి స్వాధీనం

● ఇద్దరి అరెస్ట్

ప్యారీస్, మార్చి 11: స్థానిక తరమణిలో ఉన్న ఐఐటీ ప్రాంగణంలో విద్యార్థులకు గంజాయి విక్రయించిన ఇద్దర్ని అరెస్ట్ చేసిన పోలీసులు, వారి నుంచి 3 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. తరమణి ప్రాంతంలో ఉన్న ప్రభుత్వ మహోన్నత పాఠశాల, ఐఐటీ విద్యార్థులకు గంజాయి విక్రయిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో, అసిస్టెంట్ పోలీస్ కమిషనర్ కన్నన్ నేతృత్వంలో ఏర్పాటైన ప్రత్యేక బృందం తరమణి ప్రాంతంలో నిఘా వేసింది. ఐఐటీ ప్రాంగణంలో అనుమానాస్పదంగా సంచరించిన ఇద్దరు యువకులను ప్రశ్నించగా పొంతన లేకుండా సమాధానం చెప్పారు. దీంతో, అసోం రాష్ట్రానికి చెందిన రెహ్మాన్, ఒడిశాకు చెందిన కుమార్‌జిన్నాను పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి విచారణ జరిపారు. నిందితులు తరమణి ప్రభుత్వ పాఠశాల సమీపంలో ఓ అద్దె ఇంట్లో నివసిస్తూ గంజాయి పొట్లాలు విక్రయిస్తున్నట్లు తెలిసింది. దీనిపై కేసు నమోదుచేసిన పోలీసులు, సోమవారం కోర్టులో హాజరుపరచి రిమాండ్‌కు తరలించారు.

ఎలక్ట్రానిక్ దుకాణంలో అగ్నిప్రమాదం

ప్యారీస్, మార్చి 11: స్థానిక రామాపురంలోని ఎలక్ట్రానిక్ దుకాణంలో ఆదివారం రాత్రి జరిగిన అగ్నిప్రమాదంలో లక్షల విలువైన పరికరాలు మంటల్లో కాలి బూడిదైనట్లు పోలీసులు తెలిపారు. గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ వలసరవాక్కం జోన్ 154వ వార్డు రామాపురంలో ఓ ప్రైవేటు సంస్థకు చెందిన ఎలక్ట్రానిక్ పరికరాలు, భవన నిర్మాణ సామగ్రి దుకాణాన్ని ఆదివారం మూసివేశారు. రాత్రి 10 గంటల సమయంలో ఆ దుకాణం నుంచి పొగలు వ్యాపించడాన్ని గమనించిన స్థానికులు రామాపురంలోని పోలీస్ స్టేషన్, అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. ఫైరింజన్‌తో అక్కడికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది సుమారు రెండు గంటలు పోరాడి మంటలను అదుపుచేశారు. షార్ట్‌సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదం జరిగి ఉంటుందని భావిస్తున్న పోలీసులు ఆ మేరకు కేసు నమోదు చేశారు.

విజయ్‌ను డైరెక్ట్ చేయనున్న హెచ్.వినోద్


విజయ్

అగ్రహీరో అజిత్ కుమార్‌తో 'వలిమై', 'తుణివు' వంటి హిట్ చిత్రాలను రూపొందించిన దర్శకుడు హెచ్.వినోద్. తాజాగా అగ్రహీరో విజయ్‌ను డైరెక్ట్ చేయనున్నారు. ఇది విజయ్ నటించే 69వ చిత్రం. నిజానికి విశ్వనటుడు కమలహాసన్ నటించే 233వ చిత్రానికి హెచ్.వినోద్ దర్శకత్వం వహిస్తారనే టాక్ వినిపించింది. కానీ, దీనిపై అధికారిక ప్రకటన వెలువడలేదు. ఈ నేపథ్యంలో విజయ్ నటించే 69వ చిత్రానికి వినోద్ దర్శకత్వం వహించడం నిర్ధారణ అయ్యింది. వినోద్ చెప్పిన కథకు విజయ్ సంతృప్తి చెందడమే దీనికి కారణం. అయితే ఈ ప్రాజెక్టును నిర్మించే నిర్మాణ సంస్థ, నటీనటుల వివరాలు వెల్లడికావాల్సి ఉంది. మరోవైపు, విజయ్.. వెంకట్ ప్రభు దర్శకత్వంలో 'ది గోట్' లో నటిస్తున్నారు. ఆ తర్వాత తన 69వ చిత్రంలో నటించి సినిమాలకు దూరం కానున్నట్టు విజయ్ ప్రకటించారు. దీనికి కారణం ఆయన తమిళగ వెట్రి కళగం పేరుతో రాజకీయ పార్టీని స్థాపించిన విషయం తెల్సిందే.


హెచ్.వినోద్

'బైరి' చిత్ర బృందానికి శివకార్తికేయన్ అభినందన



'బైరి' చిత్ర బృందాన్ని హీరో శివకార్తికేయన్ ప్రత్యేకంగా అభినందించారు. నాగర్‌కోయిల్ సమీపంలోని ఒక చిన్న గ్రామంలో జరిగే పావురాళ్ల పందెంను నేపథ్యంగా చేసుకుని 'బైరి' చిత్రాన్ని తెరకెక్కించగా, గత నెలలో విడుదలై, మంచి విజయాన్ని సాధించింది. తండ్రిని కోల్పోయిన తన కుమారుడు బాగుండాలని ఓ తల్లి కోరుకుంటుంది. కానీ, తల్లిమాటలను పెడచెవినపెట్టిన కుమారుడు.. పావురాళ్ల పందేనికి బానిసవుతాడు. పావురాళ్ల పందెంలో ఉన్న సమస్యలతో పాటు పాతకక్షలు, గ్రామ సమస్యలు, నమ్మక ద్రోహం వంటి అంశాలతో ఈ చిత్రాన్ని దర్శకుడు జాన్ గ్లాడీ రూపొందించారు. రమేష్ ఆరుముగం, మోహన ఎలన్ తదితరులు నటించారు. చిత్రాన్ని చూసిన శివకార్తికేయన్... ఆ చిత్ర బృందాన్ని పిలిచి ప్రత్యేకంగా అభినందించారు. అలాగే, ఫిబ్రవరిలో విడుదలైన రిజో రాజ్ 'జో' చిత్ర బృందాన్ని కూడా ఇదేవిధంగా శివకార్తికేయన్ అభినందించిన విషయం తెల్సిందే.

ప్రతినాయకుడిగా హీరో భరత్

గ్రామీణ నేపథ్య చిత్రాలను తెరకెక్కించడంలో మరో భారతీరాజాగా తమిళ చిత్రపరిశ్రమలో గుర్తింపు పొందిన డైరెక్టర్ ముత్తయ్య. ఈయన తన కుమారుడు విజయ్ ముత్తయ్యను హీరోగా వెండితెరకు పరిచయం చేస్తూ ఓ చిత్రానికి శ్రీకారం చుట్టారు. ఇందులో ప్రతినాయకుడి పాత్రను హీరో భరత్ పోషించనున్నట్టు కోలీవుడ్ వర్గాల సమాచారం. ఈ వార్తలు నిజమైతే... భరత్ విలన్‌గా నటించే మూడో చిత్రం ఇది. గతంలో పలు చిత్రాల్లో హీరోగా నటించిన భరత్‌కు.. ఏ ఒక్కటీ కెరీర్ బ్రేక్ ఇవ్వలేదు. ఈ నేపథ్యంలో తన వద్దకు వచ్చే విలన్ అవకాశాలను కూడా ఆయన వదులుకోవడం లేదు. ఈ క్రమంలోనే ముత్తయ్య దర్శకత్వంలో ఆయన కుమారుడు విజయ్ నటించే చిత్రంలో విలన్‌గా నటించేందుకు సిద్ధమైనట్టు తెలుస్తోంది. ఈ సినిమా కూడా పూర్తి గ్రామీణ నేపథ్యంలోనే తెరకెక్కనుంది. కాగా, గతంలో ముత్తయ్య దర్శకత్వం వహించిన 'కొంబన్', 'కుట్టి పులి', 'విరుమన్' ఘనవిజయం సాధించిన విషయం తెల్సిందే.


ముత్తయ్య, భరత్

చిత్రజ్యోతి

డాడీకి ముద్దుపెడితే తప్పేంటి?

● నటి ఇంద్రజా శంకర్


ఇంద్రజా శంకర్

తనను చిన్నప్పటి నుంచి పెంచి పెద్ద చేసిన తండ్రికి ముద్దు (లిప్‌లాక్) పెట్టడంలో తప్పేముందని నటి ఇంద్రజా శంకర్ ప్రశ్నిస్తున్నారు. కోలీవుడ్‌కు చెందిన ప్రముఖ హాస్య నటుడు రోబో శంకర్ కుమార్తె ఇంద్రజా శంకర్. ఇటీవల ఈమెకు నిశ్చితార్థం జరిగింది. ఈ వేడుకల్లో భాగంగా ఆమె తన తండ్రి రోబో శంకర్‌కు పెదవులపై ముద్దుపెట్టింది. దీనికి సంబంధించిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ రావడంతో చర్చనీయాంశంగా మారాయి. దీనిపై ఇంద్రజా శంకర్ స్పందించారు. 'నా తండ్రికి నేను పెదవులపై ముద్దు పెట్టడంలో తప్పేముంది. చిన్నప్పటి నుంచే డాడీ పెదాలపై ముద్దులు పెట్టడం నాకు అలవాటు. ఇపుడు నాకు పెళ్లి కాబోతుంది. అలాగని.. నేను నా తండ్రిని వదిలి వెళ్లిపోవాలా? మా డాడీకి పెట్టిన ముద్దుపై తప్పుగా మాట్లాడుతున్న వారు తమ నేత్రాలను సరి చేసుకోవాలి' అని ఆమె పేర్కొన్నారు.


కోలాహలంగా చేపలు పట్టే వేడుకలు


పెద్ద చేపలతో గ్రామస్తులు

పెరంబూర్, మార్చి 11: శివగంగ జిల్లాలో సోమవారం నిర్వహించిన చేపలు పట్టే వేడుకలు కోలాహలంగా సాగాయి. సింగంపునరి సమీపం నెర్‌కుప్పం శివార్లలో పెద్ద చెరువు ఉంది. గ్రామస్తులు ఈ చెరువులో చేప పిల్లలు వేసి సంరక్షిస్తుంటారు. చెరువులో నీటిమట్టం బాగా తగ్గిన తర్వాత, చేపలు పట్టే వేడుకలు నిర్వహిస్తుంటారు. ఆ ప్రకారం, ప్రస్తుతం చెరువులో నీటిమట్టం తగ్గడంతో చేపలు పట్టే వేడుకలు నిర్వహించారు. నెర్‌కుప్పంతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పెద్దసంఖ్యలో చేపట వేటలో పాల్గొన్నారు. ఇళ్లలో వినియోగించే దోమతెరలు, దుప్పట్లు, చీరలు, చిన్న సైజు వలలతో గ్రామస్తులు చేపలు పట్టుకొనేందుకు పోటీపడ్డారు. సుమారు 10 కిలోల బరువున్న విరాల్ సహా పలురకాల చేపలు పట్టుకొని ఆనందంగా ఇళ్లకు తిరిగివెళ్లారు.

నేటినుంచి రంజాన్ ఉపవాస దీక్షలు

● ప్రత్యేక ప్రార్థనలకు మసీదులు, ఈద్గాల ముస్తాబు



ప్యారీస్, మార్చి 11 : నెలవంక కనిపించడంతో రాష్ట్రంలో పవిత్ర రంజాన్ మాసం ఈనెల 12న మంగళవారం ఉపవాసదీక్షలతో ప్రారంభమవుతుందని తమిళనాడు ప్రభుత్వ చీఫ్ ఖాజీ డాక్టర్ సలావుద్దీన్ మహమ్మద్ అయూబ్ ప్రకటించారు. ఏప్రిల్ 10వ తేదీ వరకు కొనసాగనున్న ప్రత్యేక ప్రార్థనలకు రాష్ట్రవ్యాప్తంగా మసీదులు, ఈద్గాలు ప్రత్యేక వసతులతో సిద్ధమయ్యాయి. రంజాన్ మాసంలో ముస్లింలు నెల రోజులపాటు ఉపవాస దీక్షలను నియమనిష్టలతో చేపడతారు. ఇస్లాం మత ఆచారాల ప్రకారం ఉపవాసం విరమించడానికి, ప్రారంభించడానికి ముందు సహర్, ఇఫ్తార్ నిర్వహిస్తారు. ఇస్లాం క్యాలెండర్ ప్రకారం రంజాన్ తొమ్మిదో నెలలో... అది కూడా నెలవంక కనిపించిన తర్వాతే ప్రారంభమవుతుంది. ముస్లిం మత విశ్వాసాల ప్రకారం రంజాన్ పవిత్ర మాసంలో ఉపవాస దీక్షలను పాటించాలి. వీటిని మూడు అష్రాలుగా విభజించారు. తొలి పది రోజుల ఉపవాస కాలాన్ని రహమత్ అని, రెండో పదిరోజుల కాలాన్ని బర్కత్ అని, ఇక చివరి పది రోజుల ఉపవాస కాలాన్ని మగ్ఫిరత్ అని అంటారు. రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ ఖాజీ ప్రకటన మేరకు మంగళవారం ఉదయం 4.39 గంటలకు సహర్‌తో ప్రారంభమవుతుంది. సాయంత్రం 6.26 గంటలకు ఇఫ్తార్‌తో తొలి రోజు ఉపవాసాన్ని విరమిస్తారు.

సూర్యోదయానికి ముందు...

ఇస్లాం మత విశ్వాసాల ప్రకారం సూర్యోదయానికి ముందు అంటే ఉదయం ఫజర్ ఆజాన్‌తో ప్రారంభమవుతుంది. ఆ సమయంలో సహర్ కూడా ప్రారంభమవుతుంది. అంటే రంజాన్ మాసంలో సూర్యోదయానికి ముందే ఆహారం తీసుకోవాలి. ఉపవాసం ఉండేవారంతా పగటి పూట ఏమీ తినకుండా, కనీసం మంచి నీరైనా తాగకుండా సాయంత్రం నమాజ్ చేసి ఖర్జూర ఫలాలు తిని, గంజిని సేవించి ఉపవాసాన్ని విరమిస్తారు. సాయంత్రం సూర్యుడు అస్తమించిన సమయాన్ని మగ్రిబ్ అంటారు. ఆ సమయంలో ఉపవాసాన్ని విరమించేవారు ఇష్టమైన ఆహారం తీసుకుంటారు. సహర్‌కు ముందు ఇఫ్తార్ తర్వాత ఏదైనా తినొచ్చునని ఇస్లాం మత గురువులు చెబుతున్నారు. కాగా ఈ సారి పవిత్ర రంజాన్ మాసం ఉపవాస దీక్షలు 30 రోజులొచ్చాయి. చివరి ఉపవాసం వచ్చే ఏప్రిల్ 10 తేదీన విరమించాలి. ఈ లెక్కన ఏప్రిల్ 11వ తేదీ ఈద్ (పండుగ)ను కోలాహలంగా ఇస్లామీయులు జరుపుకోనున్నారు.

● ఉపవాసం ఉండేవారు ప్రతిరోజూ కచ్చితంగా ఐదుసార్లు నమాజు చేయాలి.

● రంజాన్ మాసంలో జకాత్ అంటే ప్రతి ఒక్కరూ దానం చేయాలి.

● అల్లాహ్ ప్రసాదించిన ఈ దివ్య కాలంలో నెలంతా చెడు ఆలోచలనకు దూరంగా ఉండి స్వచ్ఛమైన మనస్సుతో ఉపవాస దీక్షను కొనసాగించాలి.

జోరుగా ప్రచార వాహనాల తయారీ


ప్రచార వ్యాన్ లోపల వైరింగ్ పనులు చేస్తున్న కార్మికులు

చెన్నై, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తుండటంతో రాష్ట్రంలోని ప్రధాన రాజకీయ పార్టీ నాయకులంతా ప్రచారానికి సిద్ధమవుతున్నారు. ఈ నాయకుల కోసం వాణిజ్య నగరమైన కోయంబత్తూరులో సకల సదుపాయాలతో హైటెక్ ప్రచార వాహనాలు తయారవుతున్నాయి. కోయంబత్తూరులోని ఓ ప్రైవేటు సంస్థ ప్రధాన పార్టీల నాయకుల కోసం ప్రచార వాహనాల తయారీ కాంట్రాక్టును పొంది వాటిని ముమ్మరంగా తయారు చేస్తోంది. ఈ సంస్థ గతంలో రాజీవ్ గాంధీ, కరుణానిధి, జయలలిత, డీఎండీకే చీఫ్ విజయకాంత్, కేరళ సీఎం కరుణాకరన్ తదితర నాయకుల కోసం ప్రచార వాహనాలను రూపొందించింది. ప్రస్తుతం లోక్‌సభ ఎన్నికల సమీపిస్తుండటంతో ఆ సంస్థ పలువురు రాజకీయ నాయకులు, ప్రముఖుల కోసం ప్రచార వాహనాలను తయారు చేస్తోంది. ఈ విషయమై ఆ సంస్థ యజమాని మహమ్మద్ రియాజ్ మాట్లాడుతూ... ఐదు దశాబ్దాలకు పైగా తమ సంస్థ ప్రచార వాహనాలను తయారు చేస్తోందని చెప్పారు. రాష్ట్రంలో రాజకీయ నేతలు, ప్రముఖులకు తమ సంస్థ 95 శాతం దాకా ప్రచార వాహనాలను తయారు చేసిందన్నారు. రాష్ట్రంలోని నాయకులే కాకుండా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, కేరళ రాష్ట్రాలకు చెందిన నాయకుల కోసం ప్రచార వాహనాలు తయారు చేస్తున్నామని వివరించారు. రాజకీయ నాయకుల అవసరాలకు తగినట్టు ప్రచార వాహనాలు తయారు చేసి అందిస్తున్నామని చెప్పారు. తమ ఇళ్లలో ఉన్నట్లు ప్రచార వాహనంలో సదుపాయాలు ఉండేటట్లు తయారు చేయమని కోరుతున్నారని చెప్పారు. అందుకు తగినట్టే సోఫా, టాయ్‌లెట్, ఎల్ఈడీ లైట్లు, ఏసీ తదితర సదుపాయాలతో ప్రచార వాహనాలను డెలివరీ చేస్తున్నామని చెప్పారు.


ప్రచార వాహనం పైకప్పును తయారు చేస్తున్న కార్మికులు

కొత్త వెరైటీలు...

ప్రస్తుతం నాయకులంతా కొత్త సాంకేతిక పద్ధతులతో కూడిన ప్రచార వాహనాలను ఇష్టపడుతున్నారని, ఆ ప్రకారం చుట్టూ తిరిగే కుర్చీ, మీట నొక్కగానే ప్రచారవాహనంపై తెరచుకునే విశాలమైన పైకప్పు, ప్రచారవాహనం లోపల నుంచి పైకి వెళ్లేలా వెడల్పయిన మెట్లు, తమకు ఇరువైపులా సెక్యూరిటీ గార్డులు నిలిచేందుకు ఏర్పాట్లు, వాహనం చుట్టూ గుమికూడే ప్రజలను చూడగలిగేలా 360 డిగ్రీల కోణంలో తిరిగే సీసీ కెమెరాల సదుపాయంతో తయారు చేసుకుంటున్నారని పేర్కొన్నారు.

అన్నాడీఎంకేకు మద్దతుగా కమెడియన్ వయ్యాపురి ప్రచారం


వయ్యాపురి

చెన్నై, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో అన్నాడీఎంకేకు మద్దతుగా ప్రచారం చేయనున్నట్లు తమిళ హాస్యనటుడు వయ్యాపురి తెలిపారు. మదురైలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ... తన ప్రచారం ప్రత్యర్థులపై, ఇతర నటీనటులపై విమర్శలు చేసే రీతిలో ఉండదని, దివంగత మాజీ ముఖ్యమంత్రులు, ఎంజీఆర్, జయలలిత అమలు చేసిన ప్రజా సంక్షేమ పథకాలు, ప్రస్తుతం పార్టీ ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి పార్టీకి చేస్తున్న సేవలు గురించి మాత్రమే మాట్లాడుతానని చెప్పారు. సినిమా షూటింగ్‌లు లేని రోజుల్లో అన్నాడీఎంకే అధిష్ఠానం తెలిపే ప్రాంతాల్లో ప్రచారానికి వెళతానని వయ్యాపురి తెలిపారు.

మాజీ డీజీపీ రాజేష్‌దాస్‌కు 'లుక్అవుట్' నోటీస్



మాజీ డీజీపీ రాజేష్‌దాస్

చెన్నై, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మహిళా పోలీసు ఉన్నతాధికారిపై లైంగిక వేధింపులకు పాల్పడిన కేసులో జైలు శిక్ష విధించబడి ప్రస్తుతం పరారీలో ఉన్న మాజీ స్పెషల్ డీజీపీ రాజేష్‌దాస్ విదేశాలకు పారిపోకుండా పోలీసులు లుక్ అవుట్ నోటీసు జారీ చేశారు. దేశంలోని అన్ని విమానాశ్రయాల్లో రాజేష్‌దాస్ కదలికలపై నిఘా ఉంచాలని ఆదేశించారు. 2021 అన్నాడీఎంకే ప్రభుత్వ హయంలో అప్పటి ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి పర్యటన విధులు ముగించుకుని చెన్నైకి తిరిగొస్తున్న రాజేష్‌దాస్ తన వెనుకే మరో కారులో వస్తున్న మహిళా పోలీసు అధికారిని బలవంతంగా తన కారులో ఎక్కించుకుని లైంగిక వేధింపులకు పాల్పడినట్లు ఆరోపణలు వచ్చాయి. ఆ మహిళా పోలీసు అధికారి ఫిర్యాదు మేరకు కేసు నమోదై విల్లుపురం కోర్టులో విచారణ జరిగింది. రాజేష్‌దాస్‌కు మూడేళ్ల జైలు శిక్ష పడింది. ఆ శిక్షపై స్టే తెచ్చుకునేందుకు ఆయన చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. చివరకు సీబీసీఐడీ పోలీసులు ఆయన్ను అరెస్టు చేసేందుకు ప్రయత్నించినప్పుడు పరారైనట్లు గుర్తించారు. ఈ నేపథ్యంలో సోమవారం ఉదయం సీబీసీఐడీ పోలీసులు రాజేష్‌దాస్ విదేశాలకు పారిపోకుండా ఉండేందుకు లుక్ అవుట్ నోటీసును జారీ చేశారు.


చెన్నై తండయార్‌పేట కలరా ఆసుపత్రిలో హెల్త్‌మిక్స్ ప్యాకెట్లను పంపిణీ చేస్తున్న గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ మేయర్ ఆర్.ప్రియ


రాజ్‌భవన్‌లో డాక్టర్ ఎం.ఎల్.రాజా పరిశోధన బృందం రచించిన 'ప్రాచీన తమిళ సాహిత్యంలో భారతీయ సంస్కృతి, తమిళ శాసనాల్లో భారతీయ సంస్కృతి' అనే గ్రంథాలను ఆవిష్కరిస్తున్న గవర్నర్ రవి

రాష్ట్రంలో పెరుగుతున్న పగటి ఉష్ణోగ్రతలు



అడయార్, మార్చి 11: రాష్ట్రంలో పగటిపూట ఉష్ణోగ్రతలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. మరో రెండు రోజుల్లో ఈ వేసవి తాపం మరింతగా పెరుగుతుందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఇప్పటికే ఎండలు మండిపోతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా గత రెండు వారాలుగా పలు ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయి లో నమోదువుతున్నాయి. చెన్నై నగరంలో ఈ యేడాది ఎండలు మండిపోవచ్చని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఇప్పటికే మధ్యాహ్నం సమయంలో పలు ప్రాంతాల్లోని రహదారులు బోసిబోయి కనిపిస్తున్నాయి. ఈ ఎండతాపం నుంచి తప్పించుకునేందుకు ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఎండతాపం నుంచి ఉపశమనం పొందేందుకు చల్లని పానీయాలు, కూల్‌డ్రింక్స్ తాగుతున్నారు. మరోవైపు శరీరాన్ని చల్లబరిచే పుచ్చకాయలు, కొబ్బరిబొండాల విక్రయాలు పెరుగుతున్నాయి. అదేసమయంలో ఈ ఎండ వేడిమి నుంచి తప్పించుకునేందుకు ప్రజలు తమ ఇళ్లకే పరిమితమవుతూ, ఏసీలు, కూలర్లు వేసుకుని ఉపశమనం పొందుతున్నారు. దీంతో విద్యుత్ వినియోగం కూడా క్రమంగా పెరుగుతోంది. ఈ నేపథ్యంలో ఈ నెల 16వ తేదీ వరకు తమిళనాడు, పుదుచ్చేరి, కారైక్కాల్ ప్రాంతాల్లో ఎండల ప్రభావం అధికంగా ఉంటుందని చెన్నై ప్రాంతీయ వాతావరణ కేంద్రం తెలిపింది. పైగా వచ్చే రెండు రోజుల్లో ఎండల తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉందని, అందువల్ల ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరించింది.

తేనిలో పోటీకి సిద్ధం

విజయ ప్రభాకరన్ ప్రకటన



చెన్నై, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ఏ కూటమిలో చేరినా తాను తేని నియోజకవర్గం నుంచి పోటీ చేయడానికి సిద్ధంగా ఉన్నానని డీఎండీకే మాజీ అధ్యక్షుడు విజయకాంత్ తనయుడు విజయ ప్రభాకరన్ ప్రకటించారు. పెరియకుళంలో పార్టీ నాయకుడి ఇంట జరిగిన వివాహ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఆ సందర్భంగా ఆయన విలేకరుతో మాట్లాడుతూ... తన తండ్రి విజయకాంత్ ప్రజలతోనే పొత్తుపెట్టుకుని డీఎండీకేను ప్రధాన ప్రతిపక్షం స్థాయికి తీసుకెళ్లారని గుర్తు చేశారు. ప్రస్తుతం తమ పార్టీ ఏ కూటమిలో చేరినా ఘనవిజయం సాధిస్తుందన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో తేని లేదా విరుదునగర్ నియోజకవర్గంలో పోటీ చేసే అవకాశం ఉందని చెప్పారు.

ఒప్పో ఇండియా నుంచి కొత్త స్మార్ట్ ఫోన్


కొత్త స్మార్ట్‌ఫోన్లను ప్రదర్శిస్తున్న ఒప్పో ఇండియా ప్రాడక్ట్ స్పెషలిస్ట్ శీతల్

చెన్నై, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): స్మార్ట్ ఫోన్ల తయారీలో పేరుగడించిన ఒప్పో ఇండియా సంస్థ ఎఫ్25 ప్రో 5జీ పేరుతో కొత్త స్మార్ట్ ఫోన్‌ను మార్కెట్లో ప్రవేశపెట్టింది. నగరంలో ఏర్పాటైన విలేకరుల సమావేశంలో ఆ సంస్థ ప్రాడక్ట్ స్పెషలిస్ట్ శీతల్ బిషిత్ కొత్త ఫోన్ విశేషాలను వివరించారు. ఈ ఫోన్ 64 ఎంపీ ట్రిపుల్ కెమెరా, 4కే వీడియో రికార్డింగ్ సదుపాయం కలిగి ఉందన్నారు. 128 జీబీ స్టోరేజ్ సదుపాయం కలిగిన ఫోన్ రూ.23,999, 256జీబీ స్టోరేజ్ సదుపాయం కలిగిన ఫోన్ రూ.25999కు లభిస్తాయన్నారు. ప్రస్తుతం ఈ ఫోన్లు లావా రెడ్ కలర్‌లో ఒప్పో ఈ స్టోర్, అమెజాన్, ఫ్లిప్‌కార్ట్‌లలో విక్రయిస్తున్నారని ఆమె తెలిపారు.